శ్రీకాంత్‌చారికి ఉత్తమసేవ అవార్డు



శ్రీకాంత్‌చారిని సత్కరించి అవార్డు ఇస్తున్న దృశ్యం

గోల్కొండ: నిస్వార్థంగా సమాజ సేవ చేసే వారిని ప్రజలు గుర్తించుకుంటారని లాల్‌దర్వాజ శ్రీ మహంకాళీ ఆలయ కమిటీ చైర్మన్ అరవింద్‌గౌడ్ అన్నారు. రాజకీయాలలో ఉంటూ కూడా సమాజ సేవ చేస్తున్న టోలిచౌకీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్ చారికి శనివారం శ్రీ మహంకాళీ మహేష్‌గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ తరపున ఉత్తమ అవార్డు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత దశాబ్దానికిపైగా శ్రీకాంత్‌చారి పేద విద్యార్థులకు అండగా నిలవడమేకాకుండా వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించినవారికి సన్మానిస్తున్నారని అన్నారు. గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి సేవలు అందించే వృత్తిపని వారికి అండగా ఉంటూ వస్తున్నారని పేర్కొన్నారు.

జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ జెర్సీ ఆవిష్కరణ



జెర్సీని ఆవిష్కరిస్తున్న జగన్‌మోహన్‌రావు, వివేక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: క్రీడారంగ అభివృద్ధి, క్రీడాకారుల అభివృద్ధి కోసం నిత్యం పరితపించి జర్నలిస్టులు క్రీడాకారులుగా మారి మైదానంలోకి దిగడం సంతోషదాయకమని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్‌రావు అన్నారు. కేఎస్‌జీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం జింఖానా మైదానంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా జర్నలిస్టుల ప్రీమియర్ లీగ్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే జి.వివేక్ మాట్లాడుతూ క్రీడా జర్నలిస్టుల పోటీలకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లైఫ్ స్పాన్ సంస్థ స్పోర్ట్స్ హెడ్ భరణి, తృక్ష ఫుడ్స్ ఎండీ భరత్‌రెడ్డి, కేఎస్‌జీ సీఈఓ సంజయ్, హెచ్‌సీఏ సీనియర్ సభ్యులు ఆగం రావ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

గోల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్వచ్ఛంద సేవా సంస్థలు అండగా ఉండటం గొప్ప మార్పు అని గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్.అనురాధాదేవి అన్నారు. స్టేట్ స్ట్రీట్ కంపెనీ వారు శనివారం ఆ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 50 స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎన్‌జీవోల సహకారంతో విద్యార్థుల్లో చదువుపట్ల ఇష్టం పెరిగిందని, దీని వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన వివిధ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛంద సేవా సంస్థలు అండగా ఉండి ప్రోత్సహించాయని చెప్పారు. దీని వల్ల హైదరాబాద్ జిల్లాలో తమ పాఠశాల విద్యార్థులు ఎన్నో బహుమతులు పొందారన్నారు. కార్యక్రమంలో స్టేట్ స్ట్రీట్ కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్టు సాయికుమార్‌కు సత్కారం



మెట్టు సాయికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ లక్ష్మయ్య

నాంపల్లి: ఇటీవల నూతనంగా తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన మెట్టు సాయికుమార్‌ను తెలంగాణ గంగపుత్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు శనివారం నాంపల్లి శాంతినగర్‌లోని మత్స్య భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు.

'రౌండ్ ది క్లాక్' మాన్‌సూన్ సెల్ సేవలు

చార్మినార్: వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలపై స్పందించేందుకు జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో రౌండ్ ది క్లాక్ మాన్‌సూన్ ఎమర్జెన్సీ సెల్ అందుబాటులోకి వచ్చింది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఎదురయ్యే సమస్యలు, పురాతన భవనాలు కూలిపోతే ఈ సెల్ సిబ్బంది వెంటనే స్పందిస్తారని జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. రోడ్లపై వర్షపునీరు, డ్రైనేజీలు పొంగిపొర్లడం వంటి సమస్యతోపాటు విద్యుత్ ఇక్కట్లపై వెంటనే స్పందించడానికి అన్ని విభాగాల సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. శిథిల భవనాల్లో ఉండే వారికి ఇళ్లు ఖాళీ చేయాలని ఇప్పటికే నోటీసులు జారీ చేశామని తెలిపారు. అధికారులు ఇచ్చే సూచనలు పాటించి వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ మాన్‌సూన్ ఎమర్జెన్సీ సెల్ (040–29560671లో సంప్రదించాలని సూచించారు.

నేడు దత్తాత్రేయ దేవాలయంలో గురుపౌర్ణిమ



కొలువుదీరిన శ్రీ దత్తాత్రేయుడు

జియాగూడ: ఈ నెల 21వ తేదీన సీతారాంబాగ్ దత్తాత్రేయగుట్టపై గల శ్రీ దత్తాత్రేయ దేవాలయంలో గురుపౌర్ణిమ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పి.గోకుల్‌సింగ్, ప్రధాన కార్యదర్శి అనిల్ సింగ్, సహకార్యదర్శి జి.శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి పి.అరవింద్ సింగ్ అన్నారు. జియాగూడలోని ముస్తయిద్‌పురా సాయిబాబ దేవాలయంలో కూడా గురుపౌర్ణిమ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, అధ్యక్షుడు వేణుకుమార్ గౌడ్ తెలిపారు.జియాగూడ మహంకాళి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం, అన్నదాన కార్యక్రమం, సంజయనగర్ నల్లపోచమ్మ తుల్జాభవాని ఉమ్మడి దేవాలయాలలో కూడా మాతేశ్వరీలకు పూజలు, మధ్యాహ్నం మహా అన్నదాన నిర్వహిస్తున్నట్లు ఆలయాల ప్రతినిధి రావుల శ్రీనివాస్, వంశీ తెలిపారు.

గోల్కొండ కోటలో నేడు 5వ పూజ

గోల్కొండ: గోల్కొండ కోటలో ఆదివారం శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారికి 5వ బోనం పూజ జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఆయన కోటపై గల ఆలయంలో 4వ బోనం ఏర్పాట్లపై జరగుతున్న వివరాలను వెల్లడించారు. అమ్మవారికి జరిగే మొత్తం తొమ్మిది పూజల్లో మూడో పూజకు భక్తులు భారీసంఖ్యలో వస్తారని అన్నారు. గోల్కొండ కోటలో వివిధ శాఖల ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

గుడిలో చోరీ.. నిందితుడి అరెస్టు

గౌలిపురా: దేవాలయంలో దొంగతనానికి పాల్పడిన ఓ నిందితుడిని మొఘల్‌పురా పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు... గౌలిపురా మురాద్ మహల్‌లోని మణిమాణికేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఉదయం పూజారి పూజలు నిర్వహించి బయటికి వెళ్లగా, సుల్తాన్ షాహీ ప్రాంతానికి చెందిన రిషన్ సింగ్ కుమారుడు అరుణ్ సింగ్ (47) దేవాలయంలోకి చొరబడి 900 గ్రాముల వెండి కిరీటం, రెండు కాపర్ కుండలు, ఇతర సామగ్రిని దొంగలించాడు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టి 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు.

వాడవాడలా.. కనులపండువగా..

- నేడు పాతబస్తీలో అమ్మవారి సామూహిక ఘటస్థాపన ఊరేగింపు
- సికింద్రాబాద్ ఉజ్జయినీ బోనాల రోజే నిర్వహణ ఆనవాయితీ
- లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఘటాలకు పొన్నం, అనిల్‌కుమార్ స్వాగతం





మీరాలంమండిలో ఘటస్థాపన ఊరేగింపు

చార్మినార్: పాతబస్తీ అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు ఆదివారం కనుల పండువగా జరగనుంది. ఈ మేరకు భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఏర్పాట్లు చేసింది. పాతబస్తీలో ఆదివారం జరిగే ప్రధాన దేవాలయాల ఘటాల సామూహిక ఊరేగింపునకు రెండు రోజుల ముందుగా.. అంటే శుక్రవారం రాత్రి మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ మాతేశ్వరి ఘటస్థాపన ఊరేగింపు వైభవంగా కొనసాగింది. ప్రతి ఏడాది సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో బోనాల జాతర రోజే పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఊరేగింపు సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

28న అమ్మవారికి బోనాల సమర్పణ

పాతబస్తీలోని ప్రధాన దేవాలయాల్లో ఆదివారం ఘటస్థాపన ఉత్సవాల అనంతరం ఈ నెల 28న అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించనున్నారు. 26న విజయవాడ ఇంద్రకీలాద్రిలో వెలసిన కనక దుర్గమ్మ తల్లి దేవస్థానం నుంచి తీసుకువచ్చిన పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, చలివిడిని పాతబస్తీలోని ప్రధాన అమ్మవారి దేవాలయాల్లో సమర్పించనున్నారు. దేవాలయం ఈవో కె.ఎస్.రామారావు ఆధ్వర్యంలోని వేద పండితులు పాతబస్తీకి రానున్నారు. 29న పాతబస్తీ ప్రధాన వీధుల్లో అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు కనులపండువగా నిర్వహించనున్నారు. ఊరేగింపు అనంతరం మరుసటి రోజు అమ్మవారికి సమర్పించే మారుబోనంతో పాతబస్తీలో ఈసారి ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలు ముగియనున్నాయి.

కాశీ విశ్వనాథ ఆలయం నుంచి ...

శాలిబండలోని కాశీవిశ్వనాథ ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఘటస్థాపన ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్ మీదుగా ఆయా ఆలయాలకు చేరుకుంటుంది. లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఏర్పాటు చేసే స్వాగత వేదిక పైనుంచి పలువురు అధికార, అనధికార ప్రముఖులు ఘటాలకు స్వాగతం పలుకుతారని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. స్వాగత వేదికపై నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అమ్మవారి ఘటాలకు స్వాగతం పలుకనున్నారు.

నేడు ఐటీఐ దరఖాస్తు గడువు

విజయనగర్‌కాలనీ: శాంతినగర్ ప్రభుత్వ ఐటీఐలోని వివిధ కోర్సులలో శిక్షణ పొందేందుకు ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించేందుకు ఆదివారం (నేడు) చివరి రోజు అని పేర్కొన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, రిజర్వేషన్లను అనుసరించి త్వరలో అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు విజయనగర్‌కాలనీ శాంతినగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో లేదా httpr://iti.teanfana.gov.inలో పొందవచ్చు.

నిధుల కోసం వినతి



దీపాదాస్ మున్షిని కలిసి నాయకులు

చాంద్రాయణగుట్ట: పాతబస్తీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని పీసీసీ కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్, నాయకులు ఎ.మహేష్ గౌడ్, అనురాధ గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లను కలిసి విన్నవించారు. గత ప్రభుత్వ హయాంలో పాతబస్తీ అభివృద్ధికి నోచుకోలేదని, ప్రస్తుతం నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఈవో శ్రీనివాసరాజు తదితరులు

గోల్కొండ: గోల్కొండ అమ్మవార్ల ఆషాఢ మాసం బోనాల జాతరకు భక్తులు భారీగా తరలివస్తున్నారని శ్రీ జగదాంబిక మహంకాళీ ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. శనివారం గోల్కొండ కోటపై గల ఆలయ ప్రాంగణంలో బోనాల 3, 4వ పూజల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా ఆలయ ఆదాయం పెరుగుతోందన్నారు. రెండు పూజల హుండీ లెక్కింపులో రూ.3,91,205 ఆదాయం వచ్చిందని తెలిపారు. మొత్తం నాలుగు పూజల్లో రూ.6,83,145 ఆదాయం వచ్చిందన్నారు.

బోనాల నిర్వాహకులకు సహకరిస్తా: ఎమ్మెల్యే



బోనాల చెక్కులు అందజేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో బోనాలు నిర్వహించే వివిధ ఆలయాల నిర్వాహకులకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్‌లో దేవాదాయ శాఖ వారు బోనాల ఉత్సవాలకు మంజూరు చేసిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మజ్లిస్ పార్టీ ఎటువంటి వర్గ భేదాలు లేకుండా అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో బోనాలు జరిగే దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు. బోనాలు విజయవంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఆలయాలు, ఊరేగింపు జరిగే ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు సునీల్ యాదవ్, కాంగ్రెస్ నాయకురాలు శోభాపాండే తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘటం ఊరేగింపు



గడ్డి కరణ్ ఇంట్లో ఘటం పూజలు

లంగర్‌హౌస్: అమ్మవారి ఘటం ఊరేగింపు వాడవాడలా ఘనంగా ఊరేగించారు. లంగర్‌హౌస్‌లో బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రధాన దేవాలయం బుజిలీ మహంకాళి ఆలయం నుంచి ఆలయ కమిటీ చైర్మన్ బోగి పరమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఘటం ఊరేగింపు ప్రారంభించారు. శనివారం ఉదయం నుంచి డిఫెన్స్ కాలనీ, మందుల బస్తీ, బాపునగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ అమ్మవారిఘటాన్ని డప్పువాయిద్యాలతో ఊరేగించారు. ఇందులో భాగంగా బాపూనగర్‌లోని గడ్డి కరణ్ గృహంలో అమ్మవారి ఘటానికి పూజలు జరిపి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఊరేగింపులో నాయకులు ఇంద్రసేనారెడ్డి, నాగేంద్రప్రకాష్‌రెడ్డి, పాండు కుమార్, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

చాంద్రాయణగుట్ట: జీహెచ్‌ఎంసీ తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) చార్మినార్ జోన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. చాంద్రాయణగుట్టలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జోనల్ అధ్యక్షుడిగా ఎం.నర్సింగ్ రావు, కార్యదర్శిగా సి.సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మిర్జా అక్బర్ బేగ్, ఉపాధ్యక్షుడిగా ప్రకాష్ సింగ్, అదనపు కార్యదర్శిగా యాదగిరి, సంయుక్త కార్యదర్శిగా డి.విఠల్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.నర్సింగ్ రావులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ గ్రేటర్ అధ్యక్షుడు జి.సంజీవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నంద కిశోర్, సలహాదారులు నాగన్న, మల్లిఖార్జున్, గౌరవాధ్యక్షుడు దిలీప్ కుమార్, సెక్రటరీ జనరల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



బాధ్యతలు స్వీకరిస్తున్న సచిన్

నాంపల్లి: దేవునికుంట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం బోర్డు చైర్మన్‌గా ఎ.ఎం.సాయిసచిన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఎస్‌ఎండీసీ సమీపంలోని దేవాలయంలో జరిగిన బోర్డు సమావేశంలో చైర్మన్, సభ్యులు బాధ్యతలను స్వీకరించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఫిరోజ్ ఖాన్ హాజరై సాయిసచిన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వెంకటేష్, బాలరాజ్, రమేష్, దేవాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి, ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చార్మినార్ తహసీల్దార్ నిహారిక ద్వారా చెక్కు అందుకుంటున్న రాకేష్ తివారి

చార్మినార్: పాతబస్తీలో నిర్వహించిన చెక్కుల పంపిణీకి హాజరు కానివారు ఈ నెల 22న దేవాదాయ శాఖ కార్యాలయంలో సంప్రదించి చెక్కులను పొందాలని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య సూచించారు. మీరాలంమండి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీలతోపాటు చార్మినార్ తహసీల్దార్ నిహారిక తదతరులు హాజరై చెక్కులను అందజేశారు. దేవాదాయ శాఖ కార్యాలయంలో శనివారం కూడా చెక్కులను అందజేశారన్నారు.

23న 'బాలానంద' వార్షికోత్సవాలు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జాంబాగ్ బాలానంద సంఘం 60వ వార్షికోత్సవాలను ఈ నెల 23వ తేదీన రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మద్దిపట్ల వెంకటభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారులకు వివిధ సాంస్కృతిక, నృత్య, నాటక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కిన్నెర సంస్థ కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

నేడు సుందరకాండ పారాయణం



రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: సంగం దేవాలయంలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి సుందరకాండ పారాయణం నిర్వహించనున్నట్లు పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా తెలిపారు. గురుపౌర్ణమి పురస్కరించుకొని సంగం రామచంద్రజీ మఠంలో రాత్రి 7 గంటల నుంచి గురుపూజా మహోత్సవం కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు గోల్కొండ అమ్మవారికి శావ



కాంత అరవింద్

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక అమ్మవారికి ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు శావ(సేవ) నిర్వహించనున్నామని జగదాంబిక బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ అన్నారు. నేడు అమ్మవారికి ఐదవ పూజ జరగనుందన్నారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఇందులో భాగంగా నిర్వహిస్తామని చెప్పారు. డప్పు వాయిద్యాలతో గోల్కొండ కోటపై అమ్మవారి ఊరేగింపు కనులపండువగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఎంపీ నాగేష్ తదితరులు

అబిడ్స్: పూర్వవిద్యార్థుల సమ్మేళనాలతో స్నేహభావాలు మరింత పెంపొందుతున్నాయని బీజేపీ జి.నాగేష్ అన్నారు. ఇలా పూర్వ విద్యార్థుల కలయికలతో విద్యార్థి దశలో పూర్వ సంఘటనలు, జ్ఞాపకాలు గుర్తు చేసుకోవడానికి ఆస్కారం ఉందన్నారు. 1989 మాసబ్‌ట్యాంక్‌లోని గవర్నమెంట్ కాన్ఫరెన్సివ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఎల్బీస్టేడియం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ, పూర్వవిద్యార్థి జి.నాగేష్ తన తోటి విద్యార్థులతో కలిసి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో సంపత్, రత్నం, గీత, శాలిని, మశ్చందర్, రామనందయ్య, అమర్నాథ్, రాగవయ్య, బాల్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై వినతి

నాంపల్లి: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పెన్షనర్స్ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి ఇ.నవనీతరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారికి తెలంగాణ పెన్షనర్స్ కేంద్ర సంఘం నేతలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, పెన్షనరీ సదుపాయాల బకాయిలు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నట్లు తెలిపారు. కరువు భృతి చెల్లించాలని, నగదు రహిత చికిత్సలను అన్ని ఆసుపత్రుల్లో చేపట్టాలని, గ్రంథాలయ సంస్థలకు 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ప్రేమ్‌కుమార్, కోశాధికారి ఈ.శ్రవణ్ కుమార్, గ్రేటర్ హైదరాబాదు అధ్యక్షులు హెచ్.రాములు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆలయ నిర్మాణానికి సాయం చేస్తా



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

నాంపల్లి: దత్తాత్రేయ కాలనీలో మహర్షి వాల్మీకి సమాజ్ దేవాలయానికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేస్తానని నాంపల్లి బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం దత్తాత్రేయ కాలనీలో వాల్మీకి సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ధరంవీర్ సింగ్ పర్యవేక్షణలో నిర్మితమవుతున్న దేవాలయాన్ని సందర్శించారు. పార్టీ సీనియర్ నేతలు ప్రదీప్ అగర్వాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. తొందరగా దేవాలయ నిర్మాణాన్ని పూర్తి చేసి భక్తుల దర్శనానికి అనుమతి ఇవ్వాలని నిర్వాహకులను కోరారు.

ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ధర్మకర్తల మండలి సభ్యులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా పూల్‌బాగ్ చారిత్రక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి నూతన కమిటీ బాధ్యతలు చేపట్టింది. కమిటీ చైర్మన్‌గా బి.లెనిన్ బాబు, సభ్యులుగా ముద్దం అమరేశ్వర్ రెడ్డి, పి.వెంకటేశ్వర్ రావు, బి.మధుసూదన్, ఆర్.మురళీధర్, ఎం.మోహన్ రెడ్డి, పి.శైలజ, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా కందాల మోహన్‌చారి ప్రమాణ స్వీకారం చేశారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో కొనసాగిన ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బోయ నగేష్, నాయకులు దుర్గేష్ గౌడ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రైతుబాంధవుడు

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని కాంగ్రెస్ కార్వాన్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. రైతుల రుణమాఫీపై సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు. నేతాజీ నగర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో హమీద్‌ఖాన్, షకీలా, అబీబ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చాంద్రాయణగుట్ట: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఫలక్‌నుమా ఏసీపీ ఎస్ఎల్ఎస్ రాజు అన్నారు. సఫా సంస్థ, ఫలక్‌నుమా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం తీగలకుంటలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు బానిసైతే భవిష్యత్ పాడవుతుందన్నారు. కార్యక్రమంలో ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, ప్రతినిధులు మౌలానా మహ్మద్ హుసాముద్దీన్, సాని జాఫర్ పాషా కిబ్లా, ఇమాం హుస్సేన్, అవినాష్ చీమోటే తదితరులు పాల్గొన్నారు.

సింగూర్ డ్యామ్ సందర్శనకు వెళ్తూ..

- కారు బోల్తా.. ఇద్దరు యువకుల మృతి
- సదాశివపేట మండలంలో ఘటన



ప్రమాదంలో పల్టీ కొట్టిన కారు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): స్నేహితులతో కలిసి సింగూర్ డ్యామ్ సందర్శనకు వెళ్తూ ఇద్దరు యువకులు తిరిగిరాని లోకాలకు వెళ్లారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన స్నేహితులు ఫైజాన్ (19), ఖాసీం (20), సైజన్(20), సిద్దిఖీ(19), జోహెద్ (21), జాకీర్(20) ఆరుగురు స్నేహితులు కారులో సరదాగా సింగూర్ డ్యామ్ సందర్శనకు బయలుదేరారు. కారును ఫైజాన్ నడుపుతున్నాడు. మార్గమధ్యలో సదాశివపేట మండలం ఆత్మకూరు శివారులోని లక్ష్మీకాంత కాటన్ మిల్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కాల్వలోకి జారీ పల్టీలు కొడుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో సిద్దిఖీ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా వారికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జాకీర్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.